# ప్రేమ పరిణామం : :

రచన :
శ్రీ. పి. భాస్కర

(గతసంచిక తరువాయి)

'సలీమా ! నువ్వు చక్రవర్తినివి అయ్యుండీ కూడా ఇలాంటి పనులు చెయ్యొచ్చా ? ఎదటివాళ్ళు తప్పుదారిలో నడుస్తుంటే, వాళ్ళను వారించి మంచి నడతలో పెట్ట వలసిన, నువ్వే ఇలా చేస్తే ఎలా చెప్పు ?' నెమ్మదిగా, సౌమ్యంగానే ప్రశ్నించాడు బాదుషా.

'అదీ ఒక పెద్ద నేరమేనా ? ఒక చిన్న మామూలు విషయానికి ఇంతగా ఆగ్రహిస్తారా ?' అతి కష్టంమీద సలీమ ఈమాటలు అనగలిగింది.

ఉగ్రరూపం దాల్చేడు చక్రవర్తి—'దుర్మార్గురాలా ! రాజాంతపురంలో ఒక పురుషుణ్ని వేషం మార్చి వుంచు కోవడం మామూలు విషయమా ? చెప్పుడు మాటలు ఎప్పుడూ విశ్వసించే వాణ్నికాను. కాని, కళ్లారా చూసింది కూడా నమ్మకుండా ఎలా వుండమంటావ్ ?'

సలీమాకు ఒక్కసారిగా వెయ్యి తేళ్ళుకుట్టి నట్లైంది—'ఏమిటీ ?' అంది సంభ్రమాశ్చర్యాలు కూడిన స్వరంతో,

'నిజం చెప్పు సలీమా ! ఇప్పుడు నువ్వు పవిత్ర మయిన అల్లావద్దకు వెడుతున్నావు. అబద్ధమాడే వేళ కాదిది ; ఆయువకుడెవరు ?'

సలీమ అంతులేని ఆవేదనతోనే అడిగింది—'ఏ యువకుడు ?'

పాదుషా కోప ఇనుమడించింది—'నువ్వు ! సఖీ, మీనా !' అని పిలచేదానవే ? ఆయువకుడు.'

'ఆఁ ! మీనా స్త్రీ కాదూ ? మగవాడా ?' గాభరాగా అడిగింది సలీమ.

'అయితే నిజంగా నీకే విషయం తేలీదా ?'

'యాఖుదా !' అప్రయత్నంగా ఆమె నోటినుండి వెలువడ్డాయి. ఆమె నయనాలు అశ్రుపూరితా లయ్యాయి. ఈ ఒక్కమాటా, ఆమె నిర్దోషి అని ఋజువు చేసింది సలీమకు సంగతి అంతా ఇప్పుడు అర్థం అయింది.

'అలా అయితే ఫర్వాలేదు. ఆ నేరానికి ఈ శిక్ష అనుభ వించవలసినదే ! నన్ను క్షమించండి. నేను అల్లా సాక్షిగా చెబుతున్నా—నిజంగా నాకా విషయం తెలి యదు.' ఆమె కంఠం రుద్ధమయింది.

'అయితే సలీమా ! నువ్వు నిర్దోషివా ? నేనెంత తొందరపడ్డాను ?' అని వాపోయాడు పాదుషా. ఆయన కూడా యేడ్వడం మొదలు పెట్టాడు. సలీమ ఆఖరు సారి పాదుషా చేతిని తన హృదయానికి హత్తుకుంది. అంత్య సమయంలో ఆమె పొందిన ఆనందానికి మేర లేదు. తను నిర్దోషి అని ఋజువయింది ; అంతే చాలు. దీనికి గురుతుగా ఆమె నీల నీల నయనాలనుండి రెండు వేడి కన్నీటి బొట్లురాలేయి,

'జహాఁపనాహ్ ! చనిపోయే ముందు మీప్రేమను చూరగొంటాననుకోలేదు. నాతుదికోర్కె ఫలించింది. మరి నాకు విచారంలేదు. గతాన్ని మరచిపొండి. తొలి సారిగ తుదిసారిగా మిమ్మల్ని ఒక కోరిక కోరుతున్నా. తప్పక మన్నిస్తారను కుంటా.'

'తొందరగా చెప్పు సలీమా !' అన్నాడు పాదుషా ; ఆమె తుదికోర్కెనయినా తీరుద్దామనే ఉద్దేశంతో.

సలీమ సాహసించి అడిగింది— 'ఆయువకుణ్ని క్షమించి విడచి పెట్టండి—'ఆమె రెండు కన్నీటి బొట్లు రాల్చి ఈ లోకాన్నుంచి దూరమై పోయింది.

పాదుషా సలీమ నొసలు పట్టుకు చూసేడు. అప్పటికే ఆమె శరీరం చల్లబడి పోయింది. ఆమె కళేబరానికి తల ఆన్చి చంటి పిల్లాడిలా యేడ్చేడు. ఏం లాభం ? చేయి జారిపోయింది. నిజానిజాలు తెలుసుకోకుండా, కోపోద్రేకంలో, తన ప్రాణాధిక్యమైన సలీమాను చేతు లార పోగొట్టుకున్నాడు. చేతులు కాలేక ఆకులు పట్టు కుంటే.... ? ? ?

## 4

కన్ను పొడుచుకున్నా కానరాని కారు చీకటిలో, నిద్రాహారాలు లేక కారాగారంలో పొర్లాడు తున్నాడు యువకుడొకడు. ఒక్కసారిగా, కీచుమని శబ్దం చేసు కుంటూ కారాగారపు ద్వారం తెరచుకుంది. ద్వారం తెర చుకోగానే గది నిండా వెలుతురు ప్రవేసించింది.... వెలుతురుతోపాటు ఒక పిలుపు కూడ వచ్చింది—'దుర దృష్టవంతుడైన యువకుడా! తెలివిలో వున్నావా?'

యువకుడు తీవ్రంగానే అడిగాడు—'ఎవరది?'

'పాదుషా' జవాబు వచ్చింది,

యువకుడు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చేడు—'తమరు ఎందుకు దయచేశారు?....ఇది పాదుషాలు రావలసిన ప్రదేశం కాదే?'

'నీ వాంగ్మూలం వినలేదు. అందుకు వచ్చేను.'

కొద్ది క్షణాలు మౌనంగా వుండి, మళ్ళీ యిలా చెప్పేడా యువకుడు—'సలీమాను అపవాదునుండి తొల గించి, ఆమె నిర్దోషి అని ఋజువు చెయ్యడానికి మాత్రమే వాగ్మూలం ఇస్తున్నా. వినండి—అప్పుడు సలీమ చిన్నపిల్ల. నేను ఆమె తండ్రి దగ్గర పని చేసే వాడిని, అప్పటినుంచీ నేను సలీమాను ప్రేమించేవాణ్ని. సలీమ కూడా నన్ను ప్రేమించేది. కాని, అది బాల్య ప్రేమ, వయసు వచ్చిందగ్గరనుంచీ ఆమె పరదాలో వుంటూ వచ్చింది. తరువాత ఆమె చక్రవర్తిని అయింది. కాని, నేను ఆమెను మరువలేక పోయాను. చాలా కాలం పిచ్చివాడిగా తిరిగాను, తుదకు వేషం మార్చుకుని దాసీగా ఇక్కడ కుదిరాను. సలీమాను చూస్తూ ఆమెకు సేవచేస్తూ రోజులుగడపాలని నిశ్చయించుకున్నా. కాని, ఆరోజు పాలవంటి వెన్నెల, సువాసన పుష్పాలు; మధు పమత్తు; ప్రశాంత ఏకాంతం కలసి నన్ను వివశుణ్ని చేసేయి. సలీమ ముఖం మీది శ్వేదబిందులు తుడుస్తున్నా, నాలో ఏవేవో భావాలు కలిగాయి. తరువాత ఏం చేసేనో నాకు గుర్తులేదు. నాకు స్పృహ వచ్చేసరికి ఎదురుగా మీరు కనుపించారు. అప్పటినుంచీ మీకు తెలసినదే. నేను చేసిన నేరం ఇది. ఇందులో సలీమాకు ఎంత మాత్రం భాగం లేదు.'

పాదుషా కొంచెం మౌనంగా నిలువబడి, తరుహాత కారాగారపు ద్వారం బంధించకుండానే వెళ్ళి పోయాడు.

## 5

సలీమ మృత్యువాత బడి పదిరోజులు కావస్తూంది. పాదుషా రేయింబవళ్ళు సలీమ గదిలోనే గడుపు తున్నాడు. ఆ గదికి `దురుగా, కొండకాలువ అవతలి ఒడ్డున, చెట్లసమూహంలో, సలీమ సమాధి పాలరాతితో కట్టబడింది. పాదుషా వేటకు పోయిన నాడు, ఏకిటికీ వద్ద కూర్చుని సలీమ పాదుషా కోసం ఎదురు చూసిందో; అదే కిటికీ వద్ద కూర్చుని పాదుషా ఈనాడు సలీమ సమాధి చూస్తూ కాలంగడపు తున్నాడు. పగలూ, రాత్రీ అలాగే కూర్చుని వుంటున్నాడు.

అలా అర్ధరాత్రి గడచే సరికి, ఆగంభీర నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఒక కరుణగీతం విన బడుతూంటుంది, పాదుషా పూర్తిగా వింటాడా పాటను. ఎవరో జాలి గొలిపే గొంతుతో పాడుతుంటారు.

'హైరీ, మైతో ప్రేమ దివానీ మేరా'

'దర్ద్ నజానే కోయీ....'

పాదుషా కళ్ళనుండి కన్నీరు మున్నీరై ప్రవహిస్తుంది; ఆపాట వింటుంటే.

(హిందీ కవి
'చతుర సేన శాస్త్రి'కి
కృతజ్ఞతతో.)

---

### గమనిక

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితం, ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులు కాము.

—సంపాదకుడు.